క్లుప్తంగా

నేడు అయ్యప్ప గ్రామోత్సవం

దువ్వూరు : దువ్వూరులో బుధవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు అయ్యప్ప, గోవింద స్వాముల సేవా సమితి సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటలకు వినాయక ఆలయం వద్ద అయ్యప్పస్వామి పడిపూజ జరుగుతుందని వివరించారు.

వేడుకగా తిరుణాల




గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలో సోమవారం రాత్రి తిరుణాల మహోత్సవం వైభవంగా జరిగింది. అర్ధరాత్రి గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారు జాము వరకు కొనసాగింది.

గొడుగుల ఉత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో చౌడేశ్వరిదేవి జ్యోతుల ముగింపు సందర్భంగా మంగళవారం గొడుగుల ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమగల కలశాలను, గొడుగులను మంగళవాయిద్యాల సందడి, చౌడేశ్వరిదేవి నామస్మరణల మధ్య నృత్యం చేస్తూ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో బండారు సూర్యనారాయణ, చౌడయ్య, తారకరామా, రవి, రామసుబ్బయ్య, పుల్లగూర సుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భస్మహారతి



అగస్త్యేశ్వరస్వామికి భస్మహారతి ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాస అమావాస్య సందర్భంగా అగస్త్యేశ్వరస్వామికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా భస్మహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకరబాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో సహస్ర మృత్తిక శివ లింగార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుల నేతృత్వంలో నియమబద్ధంగా, శివ లింగార్చన చేశారు.

వివరాలను పక్కాగా నమోదు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

దువ్వూరు : అసైన్డ్ భూముల పట్టాలను పొందిన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అసైన్డ్ భూముల పట్టా జారి చేసినప్పటి నుంచి 20 సంవత్సరాల అనుభవం ఉన్న రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరైనా చనిపోయి ఉంటే వారి వారసులను గుర్తించి వారికి హక్కులను కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన పెట్రోలు బంకు కోసం తహసీల్దార్ ఆఫీసు ఆవరణలో ఉన్న పాడుబడిన భవనాలను కూల్చివేసి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకుమారి, డిప్యూటీ తహసీల్దార్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

నేడు సంకల్పయాత్ర

పోరుమామిళ్ల : మండలంలోని పుల్లివీడు గ్రామంలో బుధవారం వికసిత భారత సంకల్పయాత్ర ప్రారంభమవుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కోసం 194 సంక్షేమ పథకాలు ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశ పెట్టారన్నారు. ఈ సంకల్పయాత్రలో సర్పంచ్, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగన్ చేసిన మంచిని వివరించండి



బ్రహ్మంగారిమఠం: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ



ప్రొద్దుటూరు : సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలకు వివరించాలని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓబయ్య యాదవ్, సర్పంచ్ కొండారెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కనీ్వనర్లు వీరారెడ్డి, రామకృష్ణారెడ్డి, శౌరెడ్డిపల్లె భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, చైతన్య రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దస్తగిరి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనే సీఎంగా ఉండాలి

బ్రహ్మంగారిమఠం : సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ముడుమాల సచివాలయం పరిధిలో ఏపీకి మళ్లీ జగనే సీఎంగా ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముడుమాల పంచాయతీ పరిధిలో సంక్షేమ నిధులు రూ. 17.50 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జాన్‌కెనడా, స్థానిక నాయకులు శీలం రామగురివిరెడ్డి, పెద్దిరెడ్డి, కూనపులి రాజానాయుడు, జోగయ్య, సుబ్బరాజు, నాగిరెడ్డి, బాలగురివిరెడ్డి, నరసింహులు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలి

చాపాడు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేస్తున్నారని.. ఆయన మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. మండలంలోని సోమాపురం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. సోమాపురం గ్రామ సచివాలయ పరిధిలో రూ.25.27 కోట్లతో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు అందాయన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఇదే క్రమంలో మొర్రాయిపల్లెలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, నాయకులు హాజరత్‌రెడ్డి, వీరారెడ్డి, రామాంజనేయులరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

బద్వేలు అర్బన్ : ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ సీఎంగా చేసుకుంటే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె సచివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితికి తావు లేకుండా నేరుగా ప్రజల వద్దకే పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.9.94 కోట్లు, పరోక్ష ప్రయోజనాల కింద రూ.4.75 కోట్లు చొప్పున మొత్తం రూ.14.69 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు. తొలుత సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించి సచివాలయం పరిధిలోని కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి,



ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, కౌన్సిలర్ లక్షుమ్మ, వార్డు ఇన్‌చార్జిలు వీరనారాయణరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, మౌలాలి, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, మురళి, శ్రీనివాసనాయుడు, జయరామిరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఎస్.రమణ

ప్రొద్దుటూరు : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ప్రజలకు విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ చెట్ల కొమ్మలను కత్తిరించి ముందస్తు మరమ్మతులు చేపట్టాలన్నారు. వినియోగదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఈఆర్‌ఓ ఆఫీసును తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సర్వే ప్రకారం ప్రతి వంద కుటుంబాలకు 24 కుటుంబాలు ఏసీలు వాడుతున్నాయని, ఈ కారణంగా అవసరమైన ప్రదేశాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన కొత్త విద్యుత్ సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులరెడ్డి, డీఈఈలు, ఏఈలు, జేఈలు, ప్రొద్దుటూరు, రాజుపాళెం, జమ్మలమడుగు, మైలవరం, ముద్దనూరు, పెద్దముడియం, కొండాపురం, ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించండి

రాజుపాళెం : వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బంది వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌ఈ ఎస్.రమణ పేర్కొన్నారు. మండలంలోని కొర్రపాడులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, రాజుపాళెం 33/11 సబ్‌స్టేషన్‌ను, లైన్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం రాజుపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందితో మాట్లాడారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శిరీష, రాజుపాళెం మండల ఏఈ వేణు పాల్గొన్నారు.

నరాల రామారెడ్డికి ఆటా ఆహ్వానం

ప్రొద్దుటూరు : అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈనెల 17న నిర్వహించనున్న ఆటా అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని అవధాని డాక్టర్ నరాల రామారెడ్డికి ఆహ్వానం పంపారు. పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ప్రముఖ సాహితీ వేత్తలు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. 'అవధానాలలో చమత్కారాలు' అనే అంశంపై రామారెడ్డి ప్రసంగించనున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 25వ తేదీ తర్వాత మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్టు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంటి, సాల్మన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణకు సమ్మె నోటీసు ఇచ్చారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విభాగాలకు సంబంధించి 240 మంది కార్మికులతో కలసి సమ్మెలోకి వెళతామని తెలిపారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.

నేడు వెదురూరులో వై ఏపీ నీడ్స్ జగన్

చాపాడు : వెదురూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సచివాలయం వద్ద వాలంటీర్లు, గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మెటీరియల్‌ను పంపిణీ చేస్తామన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పెన్నానదీ తీరంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రాకారోత్సవం చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా రూపొందించిన రథంపై ఆశీనులను చేసి అమ్మవారిశాల వద్దకు తీసుకువచ్చారు. అయ్యప్పస్వామి, శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి వీఏ.పద్మనాభయ్య, కోశాధికారి టి.వినోద్‌కుమార్, పీఆర్‌ఓ ధారా సంతోష్, స్వామిఅయ్యప్ప సేవాసంఘం, శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్ష దారులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

పోస్టల్ కార్యాలయం ఎదుట ఆందోళన

బద్వేలు అర్బన్ : తపాలాశాఖలోని గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ అధ్యక్షులు ఎం.రఘురామిరెడ్డి, కడప డివిజన్ సెక్రటరీ మహమ్మద్‌రఫీలు పేర్కొన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక మైదుకూరురోడ్డులోని సబ్ పోస్టాఫీసు కార్యాలయం ఎదుట ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది సమ్మె

మైదుకూరు : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మైదుకూరులో మంగళవారం తపాలా సిబ్బంది సమ్మె చేపట్టారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా ఉప తపాలా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సలీం, రమణ, సాయి, నూరుల్లా, వెంకటేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



బద్వేలు అర్బన్ : పోస్టల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

పోరుమామిళ్ల : స్థానిక తపాలా కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. జీడీయస్ యూనియన్ ఆధ్వర్యంలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. రూ. 5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు కోరుతూ కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కలసపాడు : తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా తపాలాశాఖ ఎన్‌యూజీడీఎస్ అసిస్టెంట్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక పోస్టాఫీసు ఎదురుగా దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా ఉద్యోగులకు 8 గంటలు పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూపు ఇన్స్రూ గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని, జీడీఎస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు నాయుడు, రసూల్, పీరయ్య, నాగభూషణం, మహబూబ్‌బాషా, పవిత్ర, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలసపాడు: పోస్టాఫీసు ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అట్లూరు : మండల పరిధిలోని కుంభగిరి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి నారాయణరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అందజేశారు. నారాయణరెడ్డి సోదరుడు లక్కిరెడ్డి ఓబుల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అక్కడ ఆరోగ్యశ్రీ కార్డు వర్తించకపోవడంతో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ముఖ్యమంత్రి ఉదార స్వభావంతో రూ.3.80 లక్షలు చెక్కును మంజూరు చేశారు. దీంతో మంగళవారం బాధితుడి సోదరుడైన నారాయణరెడ్డికి ఆ చెక్కును ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నివాసంలో అందజేశారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యం



ఎయిడ్స్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : ఎయిడ్స్ వ్యాధిపై అపోహ పడటం కంటే అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ పి నరేష్ కుమార్ తెలిపారు. ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవిద్య జూనియర్ కాలేజీలో మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు ఇస్తారన్నారు. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు మందులు వాడాల్సి వస్తుందని తెలిపారు. 1097 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి హెచ్‌ఐవీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత సూదులు సిరంజీల ద్వారా, హెచ్‌ఐవీ ఉన్న తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు వస్తుందని చెప్పారు. ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, సిబ్బంది రామ్మోహన్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మైదుకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల ఆందోళనలో భాగంగా మంగళవారం మైదుకూరు ఆర్టీసీ డిపో వద్ద ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిటీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఈపీఎఫ్, సీపీఎఫ్‌లపై ఆప్షన్లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పుడైనా ఆప్షన్‌ను పెట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఆర్‌పీఎస్ అరియర్స్‌ను అందరికీ ఒకేసారి చెల్లించాలన్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్షుడు బీఎస్ రెడ్డి, కార్యదర్శి జీబీ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

ప్రొద్దుటూరు : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వైఆర్‌కే రెడ్డి, వి.రామకృష్ణ, బీసీఓ రెడ్డి, భానుప్రసాద్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యత



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : మహిళలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. 21వ వార్డు పరిధిలోని 23వ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. దళారులు లేకుండా డీబీటీ ద్వారా మహిళల ఖాతాలకు నేరుగా సంక్షేమ పథకాల సొమ్మును చెల్లిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ దేశానికి ఆదర్శమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో అనూహ్య స్పందన కనిపిస్తోందన్నారు. జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3వేలకు పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పింఛన్ మొత్తాన్ని పెంచలేదని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మునిరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కింగ్ బాషా, నరసింహులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణకార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26 వేలు వేతనాలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాల్మన్, చంటి, బాలసుబ్బయ్య, ముంతాజ్ పాల్గొన్నారు.

అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద..

స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల, యూనియన్ పట్టణ కార్యదర్శి విజయ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల దీక్ష

పోరుమామిళ్ల : కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ తొలగించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో మంగళవారం స్థానిక ఐసీడీయస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ మాట్లాడారు. దీక్షలో యూనియన్



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి పి.సుబ్బరాయుడు

నేతలు విజయమ్మ, వినోద, దస్తగిరమ్మ, జ్యోతి, రేణుక, రమాదేవి, లక్ష్మీదేవి, శ్రీదేవితో పాటు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

మైదుకూరు : తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు మైదుకూరులో ధర్నా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మైదుకూరు, ఖాజీపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరించండి

ఖాజీపేట : ఖాజీపేట మండలంలోని చుక్కల భూముల సమస్య పరిష్కారం కాక చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి కడప ఆర్డీఓ మధుసూదన్‌కు విన్నవించారు. కడప ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను కలసి వినతి పత్రం అందించిన అనంతరం వారు మాట్లాడుతూ ఇదే విషయంపై ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల దృష్టికి తీసుకు వెళ్లామని అన్నారు. వారు స్పందించి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారన్నారు. రైతులు కూడా అధికారులకు కావాల్సిన అన్ని రికార్డులను ఇవ్వాలన్నారు. కడప ఆర్డీఓ రికార్డులను తెప్పించుకుని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం సంతోషకరం అన్నారు. ఈకార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరామిరెడ్డి, కొండారెడ్డి ఉన్నారు.



కడప ఆర్డీఓతో మాట్లాడుతున్న ఖాజీపేట మండల వైఎస్సార్ సీపీ నాయకులు

కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తాం

పోరుమామిళ్ల : దేశంలో నరేంద్రమోడీ కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి, కార్మికుల ఉద్యమానికి అడ్డుగోడలా నిలచి వారి హక్కులను, చట్టాలను నిర్వీర్యం చేశారని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో ఆటో యూనియన్ నాయకుడు అబ్దుల్ అధ్యక్షతన జరిగిన ఏఐటీయూసీ మండల 6 వ మహాసభలో ఆయన మాట్లాడారు. ముందుగా నాగసుబ్బారెడ్డి ఏఐటీయుసీ జెండా ఆవిష్కరించారు. మహాసభలో నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. సభలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల నాయకులు రవికుమార్, కేశవ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.